

సిరిసిల్ల మానేరు తీరంలో జాతరకు ముస్తాబైన గంగమ్మ గుడి

మల్లారెడ్డిపేటలో రెండంతస్తుల రామాలయం

ముస్తాబైన మామిడిపల్లి ఆలయం

జాతరకు పోదాం..

- జిల్లా వ్యాప్తంగా సందడి
- సిరిసిల్ల మానేరు తీరంలో సంబరాలు
- ముస్తాబైన ఆలయాలు
- నేడు మాఘ అమావాస్య జాతరలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల మానేరు, మూలవాగు తీరాల్లో జాతర సందడి మొదలైంది. ఏటా మాఘ అమావాస్య రోజున నిర్వహించే జాతర సంబరాలు అంబరాన్నంటుతాయి. ఈసారి కూడా ఉత్సాహంగా జరుపుకు నేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. శుక్రవారం సిరిసిల్ల మానేరు వాగులో గంగాభవానీ జాతరతోపాటు మడలేశ్వరస్వామి, రామప్ప రామలింగేశ్వర స్వామి జాతరలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

సిరిసిల్ల పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో కొడుముంజ గ్రామ సమీపాన చారిత్రాత్మక క్షేత్రమైన రామేశ్వరాలయం ఉంది. ప్రాచీన ఆలయమైన రామప్ప శిల్పసౌందర్యం అందరినీ ఆకట్టుకునేది. మిడ్ మానేరు ప్రాజెక్ట్ నిర్మాణంతో దేవాలయం ముంపునకు గురైంది. నాయీబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో జరిగే రామప్ప రామ లింగేశ్వస్వామి కల్యాణం జాతర ఉత్సవాలను కరకట్ట వద్ద దేవాలయం పునర్నిర్మాణం జరుగుతున్న స్థలంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో పాటు సిరిసిల్ల మానేరు నదిలో గంగాభవానీ దేవాలయం వద్ద పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహి స్తారు. గంగాభవానీకి మహిళలు ఒడిబియ్యం సమర్పించుకుంటారు. మాఘమాసం రోజున తెల్లవార్లు జరిగే ఈ జాతరకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. మానేరు ఒడ్డున రజక సంఘం ఆధ్వర్యంలో మడలేశ్వరస్వామి దేవాలయంలో జాతర మహోత్సవంతోపాటు కల్యాణం నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాలు సుందరంగా తీర్చిదిద్దారు.



మానేరు తీరంలో వెలిసిన బొమ్మల దుకాణాలు

చిరువ్యాపారుల కోలాహలం..

మాఘమాస జాతరల వద్ద చిరు వ్యాపారుల కోల హాలం జాతర శోభను మరింత పెంచుతుంది. వివిధ ప్రాంతా లనుంచి బొమ్మలు, ఇతర వస్తువులు అమ్మకా లకోసం ప్రత్యేక దుకాణాలను ఏర్పాటుచేసుకున్నారు. సిరిసిల్ల మానేరు వాగులో ఒక రోజు ముందు నుంచే అమ్మకాలు ప్రారంభించారు. ఏటు చూసినా సందడి వాతావరణం కనిపిస్తుంది.

కోరిన కోర్కెలు తీర్చే అంజన్న

గంభీరావుపేట: ఎటు చూసినా పాలరాతి బండలు.. చుట్టూ ఎత్తైన గుట్టలు.. పచ్చని పంట పొలాలు.. పారే జలపాతం.. ప్రశాంత వాతావరణం.. అపురూప రాతి కట్టడంతో చారిత్రాత్మక ప్రాధాన్యం.. కాకతీయుల కళావైభవం.. ఇలా ఇంకెన్నో సొంతం చేసుకున్న కోవెలగా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటలోని అంజన్నస్వామి ఆలయానికి పేరుంది. సీతారాముల ఆలయంతోపాటు వేంకటేశ్వరస్వామి, శివాలయం కూడా ఇక్కడే ఉన్నాయి. పూర్వం ఈ మూడు ఆలయాలను భక్తులు దర్శించుకొని నిత్యం పూజలు చేసి, పలురకాల నైవేద్యాలు సమర్పించేవారు. రామచంద్రస్వామి, అంజన్న స్వామి ఆలయాలు అభిముఖంగా ఉండడమే కాకుండా అంజన్న కంటి కాంతి కిరణాలు రాముని పాదాల్ని ఎల్లవేళలా స్పృశించేలా చేసిన ఆ కళావైభవం మహా అద్భుతంగా చెప్పుకుంటారు.

మల్లారెడ్డిపేట అంజనేయస్వామి కోరిన కోరికలు తీర్చే దేవుడిగా పూజలు అందుకుంటున్నాడు. అంజన్నస్వామి తొమ్మిది అడుగుల ఏకశిలా విగ్రహంలో భక్తులకు దర్శనమిస్తాడు. ఏటా మాఘ అమావాస్య రోజున పెద్ద ఎత్తున బీముని మల్లారెడ్డిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద జాతర సాగుతోంది. శుక్రవారం నుంచి జరిగే అంజన్న జాతరకు పెద్ద ఎత్తున వేలాది మంది భక్తులు వస్తారు. ఈ ప్రాంతం వారే గాక సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అంజన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. రామారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట, దుబ్బాక. ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు.

భక్తుల కొంగుబంగారం సీతారామస్వామి

కోనరావుపేట: మామిడిపల్లి సీతారాములస్వామిని భక్తుల కొంగు బంగారంగా కొలుస్తారు. ఈ ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. ఆలయ గుట్టపైన మునులు తపస్సు చేసేవారని, సీతారామ చంద్ర స్వామి అరణ్యవాసంలో భాగంగా ఇక్కడ కొలువుదీరారని, పురాణ గాదలతో తెలుస్తోంది. మండలంలోని మామిడిపల్లి సీతా రాముల ఆలయం వేములవాడ దక్షిణకాశీగా పేరుపొందిన రాజ రాజేశ్వర స్వామి అనుబంధ ఆలయంగా కొనసాగుతోంది. అరణ్య వాసంలో భాగంగా సీతారామచంద్రస్వామి ఈ గుట్టపైన సేదతీరా డని ప్రతీతి. రాముడి పాదముద్రలు ఇప్పటికీ కనిపిస్తాయి. అంతే కాకుండా ఈ గుట్టపైన మునులు తపస్సు చేయడంతో అప్పుడు ముని పల్లెగా ఉన్న గ్రామం రాను రాను మామిడిపల్లిగా ప్రసిద్ధి గాంచింది. ఈ ఆలయంలో ఏటా మాఘ అమావాస్య సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. రాజన్న సిరిసిల్ల జిల్లానే కాకుండా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటారు. అంతేకాకుండా మాఘ అమావాస్య జాతర సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల రైతులు తమ ఎడ్ల బండ్లతో వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. ఏటా శ్రీరామనవమి అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయంగా అభివృద్ధి చేస్తున్నారు. మాఘ అమావాస్య సందర్భంగా జరిగే జాతరకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు.

ఆలయాల అద్భుత శిల్ప కట్టడం

అద్భుతమైన శిల్ప కట్టడం సీతారామాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయానికి కలిపి ఒకే ప్రహరీ నిర్మించారు. వీటిని కాకతీయుల కాలంలో నిర్మించినట్టు ఆనవాళ్లు ఉన్నాయి. పాలరాతి రాళ్లతో రెండంతస్తుల రామాలయాన్ని అద్భుతంగా నిర్మించారు. మొదటి అంతస్తు చుట్టూ డంగు సున్నంతో కలిపి రాతి కట్టడం చేపట్టారు. ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఆలయం ఆనాటి కళా నైపుణ్యాన్ని చాటుతోంది. సీతారాముల విగ్రహాల పాదాలకు సమాం తరంగా ఎదురుగా ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేయడం విశేషంగా చెప్పుకుంటారు.

భీముని మల్లారెడ్డిపేటగా..

ద్వాపర యుగంలో పాండవులు ఈ ప్రాంతంలో కొద్ది రోజులు అరణ్యవాసం చేసినట్లు మల్లారెడ్డిపేటకు గుర్తింపు ఉంది. ఆ కాలంలో పాండవులు ముఖ్యంగా చిర్ర గోనే ఆడారని పూర్వీకులు చెప్పుకుంటారు. ఆట ఆడుతుండగా కర్ర బండ కిందకు వెళ్లిపడిందని, అగ్రజుడైన ధర్మరాజు దానిని తీసురావాలని భీముడిని కోరడంతో భీముడు బండను పైకెత్తి కర్రను తెచ్చాడని ప్రతీతి. దీనికి నిదర్శనంగా ఇప్పటికి గుహ అందరికీ కన్పిస్తుంది. దీంతో మల్లారెడ్డిపేటను భీముని మల్లారెడ్డిపేటగా పిలుస్తున్నారు.

నిబంధనలకనుగుణంగా ఈవీఎంల తనిఖీ

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 8: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిబంధనలు పాటిస్తూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)ల మొదటి స్థాయి తనిఖీలు చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాములో చేపడుతున్న మొదటి స్థాయి ఈవీఎంల తనిఖీలను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఎన్నికల సంఘం అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్షణ కోసమే షీటీం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 8: విద్యార్థుల రక్షణ కోసం షీటీం పని చేస్తోందని షీటీం ఏఎస్సై ప్రమీల అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వివిధ చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ఎవరైనా వేధిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. సమస్య ఎదురైతే షీటీం సెల్ ఫోన్ నంబర్ 8712656425కు సమాచారం అందించాలన్నారు. హెచ్ఎం మురళీధర్, షీటీం సభ్యులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

ముస్తాబాద్, ఫిబ్రవరి 8 : ముస్తాబాద్ మండల కేంద్రంలోని స్వయంభు వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రభుత్వ నిధులతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం హైమాస్ట్‌లైట్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డికి ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, ఏదూనూరి భాను, ఎద్దండి మహేందర్, రంజని నరేశ్, ఉచ్చిడి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11న చీటి వాసుదేవరావు స్మారక క్రికెట్ పోటీలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 8: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 11న జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు తండ్రి చీటి వాసుదేవరావు స్మారకార్థం క్రికెట్ పోటీలను నిర్వహించనున్నామని లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, వివిధ శాఖల అధికారులు, విలేకరులు పోటీల్లో పాల్గొనాలని కోరారు. వివరాలకు 9505635451, 9550241485 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. నాయకులు కృష్ణ హరి, జబ్బార్, శ్రీనివాస్‌రెడ్డి, రాజం, హసన్, కిషన్, విలేకరులు పాల్గొన్నారు.

అంకాపూర్ పంటల సందర్శన



పంటలను పరిశీలిస్తున్న ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్లు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 8: నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌లోని పంటల సందర్శనకు ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలోని పాలక వర్గం సభ్యులు గురువారం బయలుదేరి వెళ్లారు. అక్కడ సాగు చేస్తున్న వివిధ రకాలను పంటలను పరిశీలించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడిస్తున్న పంటల వివరాలను అక్కడి రైతుల ద్వారా తెలుసుకున్నారు. పంట మార్పిడి వ్యవసాయం, ధాన్యాన్ని మార్కెటింగ్ చేసే విధానాలు, తదితర అంశాలపై అధ్యయనం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సత్తయ్య డైరెక్టర్లు సతీష్, వెంకటనర్సింహారెడ్డి, సుధాకర్, ప్రభాకర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, సంఘం సీఈవో కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణలో ఫైరింగ్ చేస్తున్న ఎస్పీ

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 8 : విధి నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది అధునాతన టెక్నాలజీని సద్విని యోగం చేసుకోవాలని ఎస్పీ అఖిల్ మహా జన్ అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్ శివారు 17వ పోలీస్ బెటాలి యన్‌లో గురువారం జిల్లాలో పని చేస్తున్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి వార్షిక మొబైలేషన్‌లో భాగంగా ఫైరింగ్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులతోపాటు సిబ్బంది ఆయుధ పరిజ్ఞానాన్ని కల్గి ఉండాలన్నారు. ఫైరింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబ ర్చిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, సీఐలు రఘుపతి, సదన్‌కుమార్, శశిధర్‌రెడ్డి, కరుణాకర్, కిరణ్‌కుమార్, ఆర్ఐలు యాదగిరి, మధుకర్, రమేష్, ఎస్సైలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ

వేములవాడ, ఫిబ్రవరి 8 : బీఆర్ఎస్‌కు చెందిన వేములవాడ పురపాలక సంఘం కౌన్సిలర్లకు ఆ పార్టీ విప్ జారీ చేసింది. వైస్ చైర్మన్ పదవికి మధు రాజేందర్ రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు ఈ నెల 12వ తేదీన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నూతన వైస్ చైర్మన్‌ను ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్ పదవి కోసం బీఆర్ఎస్‌కు చెందిన నాలుగో వార్డు కౌన్సిలర్ మారం కుమార్, కాంగ్రెస్‌కు చెందిన 14వ వార్డు కౌన్సిలర్ బింగి మహేష్ పోటీ పడుతున్నారు. మారం కుమార్ తన మద్దతుదారులైన కౌన్సిలర్లతో కలిసి ఇప్పటికే క్యాంపు నిర్వహిస్తుండగా, బింగి మహేష్ సైతం తన మద్దతుదారుల సంఖ్యను పెంచుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. వైస్ చైర్మన్ పదవి కోసం పోటాపోటీ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకత్వం రంగంలోకి దిగి తమ పార్టీకి చెందిన కౌన్సిలర్లకు విప్ జారీ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేరిట జారీ చేసిన విప్‌ను అందుబాటులో ఉన్న కౌన్సిలర్లకు అందజేశారు. అందుబాటులో లేని కౌన్సిలర్ల ఇంటి గోడకు విప్‌కు సంబంధించిన నోటీసులను అంటించారు. ఈ నెల 12వ తేదీన జరగనున్న మున్సిపల్ ప్రత్యేక సమావేశానికి కనీసం గంట ముందుగా హాజరు కావాలని, నాలుగో వార్డు కౌన్సిలర్ మారం కుమార్ కు అనుకూలంగా ఓటు వేయాలని నోటీసులో పేర్కొన్నారు. వైస్ చైర్మన్ ఎన్నిక కోసం బీఆర్ఎస్ నాయకత్వం రంగంలోకి దిగి జారీ చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన బింగి మహేష్ తనకు మద్దతు ఇచ్చే వారికి ఆకర్షణీయమైన ప్యాకేజీ అందజేస్తానని రాయబారం ప్రారంభించినట్లు చెప్పుకుంటున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బాలికల జట్టు విజేత సిద్ధార్థ సిరిసిల్ల

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 8: క్రీడలలో గెలుపు ఓటములు సహజమని, సమానంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కబడ్డీ పోటీలలో నైపుణ్యం ప్రదర్శిస్తూ జట్టు గెలుపుకోసం కృషి చేయాలన్నారు. జాతీయ, అంతర్జాతీయా స్థాయి క్రీడల్లో రాణించాలన్నారు. మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ సహకారంతో మున్సిపల్ పరిధిలో మినీ స్టేడియం, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానం అభివృద్ధి చేసుకున్నట్లు చెప్పారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి చేశారన్నారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలబాలికలను ఈ నెల 16 నుంచి 19 వరకు సూర్యపేటలో జరిగే 33వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ముందుగా బాలికల విభాగంలో సిద్ధార్థ సిరిసిల్ల జట్టు, కేజీవీపీ ముస్తాబాద్ జట్టు ఫైనల్స్‌కు చేరాయి. సిదార్థ సిరిసిల్ల జట్టు విజయం సాధించింది. బాలుర విభాగంలో అనుపురం జట్టు, చెక్కపల్లి జట్టు ఫైనల్స్‌కు చేరాయి. చెక్కపల్లి జట్టు విజయం సాధించింది. అనంతరం విజేత జట్లకు బహుమతులను అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, ఎస్ఐ మల్లయ్యగౌడ్, జిల్లా రిఫరీ బోర్డు చైర్మన్ ప్రభాకర్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డు రాములు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ముస్కు మల్లారెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి ముస్తాఫా, మండల అధ్యక్షుడు బొడ్డు రాములు తదితరులు పాల్గొన్నారు.



బాలుర జట్టు విజేత చెక్కపల్లి

విద్యార్థులు ఇష్టంతో చదవాలి : డీఈవో



విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్న డీఈవో

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 8: విద్యార్థులు పరీక్షలంటే భయపడవద్దని, ఇష్టంతో చదివి ఉత్తీర్ణులు కావాలని డీఈవో రమేష్ కుమార్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో గురువారం పదోతరగతి విద్యార్థులకు గోరుముద్ద కార్యక్రమాన్ని స్థానిక కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్‌తో కలిసి డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీ యమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి అధిక మార్కులు తెచ్చుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుండ్లపల్లి పూర్ణచందర్, ప్రధానోపాధ్యాయుడు మోతీలాల్, పాఠశాల సెక్రెటరీ మల్లారపు పురుషొత్తం, ఉపాధ్యాయులు పాకాల శంకర్‌గౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు విరివిగా రుణాలు అందజేసి ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్లు, అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి రూ.3203.60 కోట్ల క్రెడిట్ ప్లాన్ నివేదికను ఆవిష్కరించారు. వ్యవసాయానికి సంబంధించి రూ.2137.42 కోట్లను పొందుపర్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని బ్యాంక్‌లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తమకు కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. విద్యుత్ అవసరాల నిమిత్తం సోలార్ విద్యుత్ యూనిట్‌లను ఏర్పాటు చేసుకోవడానికి ముందుకొచ్చే పవర్‌లూం, రైస్ మిల్లులు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, చిన్నతరహా పరిశ్రమలు, హౌసింగ్ యజమానులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలన్నారు. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ఆర్థిక ప్రోత్సాహాన్ని మరింత పెంచాలన్నారు. రుణాలను సకాలంలో చెల్లించిన స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. రుణాలు తీసుకొని నిర్దేశిత సమయంలో చెల్లించని సంఘాల నుంచి రీసోర్స్ పర్సన్‌ల సహాయంలో బకాయిలు వసూలు చేయాలన్నారు. పంట రుణాలు, పశు సంవర్ధక అభివృద్ధికి అర్హులకు రుణాలు ఇవ్వాలని, మహిళా సంఘాలు, గ్రామ పంచాయతీల్లో కొనుగోలు చేసిన ట్రాక్టర్ల ఈఎంఐలు చెల్లించే విధంగా చూడాలని అన్నారు. యూనిట్‌లను పూర్తి స్థాయిలో గ్రౌండ్ అయ్యేలా చూడాలన్నారు. అర్హులు ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే వెంటనే రుణం మంజూరు చేయాలన్నారు. రైతులకు ఆయిల్‌పాం సాగుకు అవసరమైన సహకారం అందించాలన్నారు.



క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ఆర్థిక అక్షరాస్యత శిబిరాలు

ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు ఆర్బీఐ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి మార్చి 6 వరకు సాధ్యమైనంత ఎక్కువగా ఆర్థిక అక్షరాస్యత శిబిరాలు నిర్వహించాలని ప్రజల్లో చైతన్యం తేవాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థులకు బ్యాంక్ సేవలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మహా శివరాత్రి సందర్భంగా వేములవాడకు వచ్చే భక్తులకు బ్యాంకింగ్ సేవలపై వివరించాలన్నారు. అకౌంట్‌లు ఇవ్వడం, ఇతర సేవలను అందించాలన్నారు. నాబార్డు అందించే రుణాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. బ్యాంక్‌లు మరింతగా ప్రజలకు చేరువ కావడానికి చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ఎల్‌డీఎం మల్లికార్జున్‌రావు, ఆర్బీఐ ఎల్‌డీవో సాయితేజరెడ్డి, నాబార్డు డీడీఎం జయప్రకాష్, యూబీఐ చీఫ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, డీపీవో రవీందర్, డీఏవో భాస్కర్, డీఎఫ్‌వో శివప్రసాద్, డీఆర్‌డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ అయాజ్ పాల్గొన్నారు.







కుక్కల దాడిలో గొర్రెలు, కోళ్లు మృతి

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 8: తంగళ్లపల్లి మండల కేంద్రంలో వీధి కుక్కల దాడిలో మేకలు, కోళ్లు మృతి చెందాయి. గురువారం తంగళ్లపల్లికి చెందిన పరకపల్లి తిరుపతికి చెందిన మేకల షెడ్‌పై వీధి కుక్కలు దాడి చేశాయి. ఆరు గొర్రెలు, 20 కోళ్లు మృతి చెందాయి. బాధిత తిరుపతి కుటుంబాన్ని ఎంపీపీ పడి గెల మానస రాజు, ఎంపీటీసీ కోడి అంతయ్య పరామర్శించారు. బాధితుడికి ఎంపీటీసీ అంతయ్య రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి విషయాన్ని తీసు కెళ్లి బాధిత కుటుంబానికి సాయం అందేలా చూస్తామన్నారు.


మృతి చెందిన మేకలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రమాదవశాత్తూ బావిలో పడిన యువకుడు

- మృతదేహం కోసం గాలింపు

శంకరపట్నం, ఫిబ్రవరి 8:మండలంలోని కరీంపేటలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. ప్రత్యేక సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్‌గౌస్ (30) అనే యువకుడు గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఊరికి సమీపంలో గల ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో జారిపడే సమయంలో సమీపంలో ఉన్న ఓ రైతు ప్రత్యక్షంగా చూసినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో బావిలో గాలింపు చర్యలు చేపట్టారు. నీరు ఎక్కువగా ఉండడంతో అచూకీ లభించలేదు. చీకటి పడడంతో గాలింపు నిలిపివేశారు.

దొంగ అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 8 : ఇటీవల నగరంలోని పలు చోట్ల ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌కు చెందిన రౌతు పవన్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. పవన్ వద్ద ట్యాబ్, 2 సెల్‌ఫోన్లు, 9 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఘనంగా లక్ష పుష్పార్చన


వాసవీమాత ఆలయంలో పూజలు

మల్లాపూర్, ఫిబ్రవరి, 8 : మల్లాపూర్ వాసవి మాత ఆలయంలో అమ్మ వారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వాహకులు గురువారం ఘనంగా జరిపారు. ఉదయం నుంచి ఆర్యవైశ్యులు, భక్తులు ఆలయంలోని అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా హల్దిపు పీఠాధిపతి శ్రీవామానాశ్రమ మహాస్వామిజీ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి, భక్తులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండ లాధ్యక్షుడు చౌడారపు శ్రీనివాస్, మైలారపు లింబాద్రి, శివ రాంకిషన్, శివ శ్రీనివాస్, గాదె మనోహర్, సంగేమ్ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి రోజు సెలవు ప్రకటించాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 8: సంత్ సేవాలాల్ మహాజన్ జయంతి రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని లంబాడీల ఐక్య వేదిక(లైవ్) అధ్యక్షుడు భూక్య నరేష్‌నాయక్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా దాదాపు మూడు కోట్లు, రాష్ట్రంలో దాదాపు 35లక్ష మంది గిరిజనులు(లంబాడీలు)ఉన్నారన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి వచ్చే వారిలో ఎక్కువ శాతం గిరిజనులు ఉంటారని, వారికి ఇబ్బందులు కలగకుండా సదు పాయాలు కల్పించాలని, పాలక వర్గంలో గిరిజనులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు మోహన్ నాయక్, రమేష్‌నాయక్, రాజేష్‌నాయక్, గంగాధర్‌నాయక్, నవీన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 8: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను ఈనెల 10న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ స్టేడియంలో మహిళలు, పురుషుల విభాగంలో ఈ పోటీలను సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహించనున్నామని జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, కార్యదర్శి సిహెచ్ సంపత్‌రావు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 25 కిలోల లోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ చాటే క్రీడాకారు లను మార్చి 2 నుంచి 4 వరకు నల్గొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు.

ఇల్లందకుంట ఆలయంలో వేలం పాటలు

ఇల్లందకుంట, ఫిబ్రవరి 8: శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో కొబ్బరి కాయలు అమ్ముకొనుటకు, పోగు చేసుకొనుటకు దేవాదాయ శాఖ డివిజన్ పరిశీ లకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం బహిరంగ వేలం నిర్వహిం చారు. ఈ మేరకు పూజా సామగ్రి, కొబ్బరికాయలు ఒక సంవత్సరం పాటు అమ్ముకొనుటకు ఎనగంటి వెంకటేశ్వర్లు రూ.7,66,000 పాట, అదేవిధంగా కొబ్బరి ముక్కలు పోగు చేసుకొనుటకు క్యాతం రాజయ్య రూ.1,60,000 పాట పాడి టెండర్ దక్కించుకున్నారు. ఈ టెండర్ వీరికి ఒక సంవత్సరం ఉంటుందని ఆలయ ఈవో కందుల సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో మోహన్, రాజయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





భార్య ఆత్మహత్య కేసులో కానిస్టేబుల్ రిమాండ్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 8: భార్య స్రవంతి ఆత్మహత్య కేసులో సిరిసిల్ల పట్టణం సర్ధాపూర్ 17వ బెటాలియన్ కానిస్టేబుల్, భర్త రాగుల నాగరాజు అనే కానిస్టేబుల్‌ను అరెస్ట్‌చేసి గురువారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన నాగరాజు, స్రవంతి అలియాస్ లాస్య దంపతులు సిరిసిల్లలో ఉంటున్నారు. భార్య స్రవంతి మృతికి భర్త నాగరాజు, అత్తలే కారణమంటూ ఆమె తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో మృతురాలి అత్తను అరెస్ట్ చేయాల్సి ఉందని ఆయన తెలిపారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చిగురుమామిడి,ఫిబ్రవరి 8: మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన కక్కర్ల లక్ష్మణ్(40) అనే గీత కార్మికుడు గురువారం ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న లక్ష్మణ్‌ను తోటి గీత కార్మికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించినట్లు గౌడ సంఘం నాయకులు తాళ్లపెల్లి రాజయ్య తెలిపారు. పేద కుటుంబానికి చెందిన గీత కార్మికుడికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రూ.6,650 పలికిన పత్తి ధర

● జమ్మికుంట మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 8: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,650 పలికింది. గురువారం వ్యవసాయ మార్కెట్‌కు 88మంది రైతులు 770క్వింటాళ్ల విడి పత్తి, 10మంది రైతులు 19క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6,650, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శుక్ర, శని, ఆదివారాలు యార్డుకు సెలవు దినాలు, తిరిగి సోమవారం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి.

రేషన్ బియ్యం పట్టివేత

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 8: మండలంలోని కందుగుల గ్రామ శివారులోని ఓ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ గురువారం తెలిపారు. పెట్రోలింగ్‌లో భాగంగా గ్రామ శివారులోని రైస్ మిల్‌లో సుమారు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టణానికి చెందిన అప్పని రమేష్, వెలగందుల ప్రకాష్, ఉప్పల్ గ్రామానికి చెందిన పోతిరెడ్డి శ్రీనివాస్ అనే వ్యక్తులు సదరు మిల్ యాజమానికి ప్రజల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి విక్రయించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 8: జన్మదిన వేడుకల సందర్భంగా రోడ్‌పై న్యూసెన్స్ చేస్తుండగా వారించిన వ్యక్తిపై బీరుసీసాతో దాడి చేసిన కేసులో ఆరుగురు యువకులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని రెండో ఠాణా పోలీసులు తెలిపారు. కార్ఖానగడ్డ గాంధీరోడ్ ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి 2:30 గంటలకు బర్త్‌డే వేడుకల సందర్భంగా యువకులు రోడ్డుపైకి వచ్చి న్యూసెన్స్ చేశారని, దీంతో స్థానికుడు గంభీరావుపేట్ పృథ్వీరాజ్ వారించగా వెంటనే యువకులు దాడి చేసి గాయపరిచారన్నారు. ఈ కేసులో కార్ఖనగడ్డకు చెందిన దసనం సాయి భరద్వాజ్, బొబ్బటి భరత్‌కుమార్, పెపకాయల సాయి మురళి, జగిత్యాల దేబివాడకు చెందిన బండ వరుణ్, మండ వర్ధన్, గాంధీనగర్‌కు చెందిన బొల్లారపు అభి అలియాస్ భరత్‌లను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ప్రయాణికురాలి బ్యాగు అప్పగింత

భగత్‌నగర్, ఫిబ్రవరి 8: బస్సులో ప్రయాణికురాలు మర్చిపోయిన బ్యాగును ఆర్‌టీసీ అధికారులు ఆమెకు అప్పగించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కొదురుపాకకు చెందిన ప్రయాణికురాలు భార్గవి ఈ నెల 7న ఆర్‌టీసీ బస్సులో బ్యాగు మర్చిపోయింది. డ్యూటీలో ఉన్న కండక్టర్ జె గంగాధర్, కానిస్టేబుల్ ఎండి అఫ్రోజోద్దిన్ ఆ బ్యాగును గుర్తించి అధికారులకు అప్పగించారు. తన బ్యాగు పోయిన విషయాన్ని ఆమె అధికారుల దృష్టికి తీసుకురాగా పూర్తి వివరాలను తెలసుకొని ఆమె బ్యాగును ఆమెకు అందచేశారు. బ్యాగులో రూ.35000లు రెండు వేల రూపాయల విలువైన బట్టలు అందులో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎర్నింగ్ డీసీ ఇబి రావు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మిరాజం, కంట్రోలర్ కె రవిందర్, కంటక్టర్ జె గంగాధర్ పాల్గొన్నారు.

ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 8: కులం పేరుతో దూషించడంతో పాటు చంపుతామని బెదిరించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సందుపట్ల రాంరెడ్డి, సందుపట్ల రాజిరెడ్డి, సందుపట్ల సత్తవ్వ, సందుపట్ల లక్ష్మారెడ్డి, సందుపట్ల పద్మారెడ్డి, మోగి ఆగయ్యలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. మండలంలోని గొల్లపల్లికి చెందిన దాసరి కృష్ణంరాజు మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలోని ప్రభుత్వ ఖాళీ స్థలంలో గత 8 ఏళ్లుగా టీకొట్టు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడని పేర్కొన్నారు. తన టీకొట్టు చుట్టూ రేకులు అమర్చుకోవడం కోసం బండరాళ్లను పేర్చుతుండగా ఇది మా స్థలం అంటూ నిందితులు బెదిరించారని తెలిపారు. అతనిపై దాడి చేయడంతో పాటు చంపుతామని బెదిరించాలని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

కత్తులతో విద్యార్థినులను బెదిరించిన యువకులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 8: ముస్తాబాద్ మండల కేంద్రంలో విద్యార్థినులను యువకులు కత్తులతో బెదిరించిన సంఘటన గురువారం కలకలం రేపింది. విద్యార్థినుల తల్లిదండ్రుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి విద్యార్థినులు భోజన సమయంలో ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల సమీపంలో ముగ్గురు యువకులు బైక్ వచ్చి కత్తులతో బెదిరించారు. విద్యార్థినుల అరుపులు విని సమీపంలో ఉన్న కాలనీవాసులు బయటకు వచ్చారు. ఈలోగా బైక్‌పై ఉన్న యువకులు పారిపోయారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. సీసీ కెమెరాల సాయంతో యువకులను పట్టుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

బీహార్ కూలీపై దాడి



కార్మికుడి ఒంటిపై గాయాలు

రామగిరి, ఫిబ్రవరి 8: మండలంలోని లొంకకేసారం సాయిబ్రిక్స్ (ఎస్ఏఐ) యాజమాని సోదరుడు ఒరిస్సా కూలీపై దాడి చేశాడు. ఇటుక బట్టీలో పనిచేసే బీహార్‌కు చెందిన చర్యా అనే కూలీపై సైండ్ల విష్ణు అనే యువకుడు గురువారం విచక్షణ రహితంగా కర్ర, చెప్పులతో దాడికి పాల్పడినట్లు కూలీ చర్యా పేర్కొన్నాడు. అర్ధరాత్రి వేళ కాలుతున్న బటీనుంచి ఇటుకలు లోడ్ చేయాలంటూ బెదిరింపులకు గురిచేశాడని తెలిపాడు. తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లను తీసుకొని ఇష్టవచ్చినట్లు దూషించాడని కూలీ ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవిప్రసాద్ తెలిపారు.

ఆవాల పరిశోధనాస్థానం ఏర్పాటయ్యేనా?

● మూడేళ్లుగా కాగితాలకే పరిమితం ● శాస్త్రవేత్తలు, నిధులు లేక అన్నదాతల్లో నిరుత్సాహం



జగిత్యాల పొలాస ప్రాంతీయ పరిశోధన స్థానం



జగిత్యాల జిల్లాలో సాగవుతున్న ఆవాల పంట

జగిత్యాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక పరిశోధనా స్థానం ఏర్పాటు కోసం ఆశపడుతున్న ఆవాల రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. మూడు సంవత్సరాలుగా జగిత్యాల జిల్లా పొలాసలో ఆవాల పరిశోధనా స్థానం ఏర్పాటు ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైంది. ఒక వైపు శాస్త్రవేత్తలు లేక..మరో వైపు నిధులు రాక ఆవాల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉత్తర తెలంగాణలో వ్యవసాయ పరిశోధనలకు కేంద్రమైన జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస పరిశోధన స్థానంలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తామని చెప్పి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ అతీ, గతీ లేకుండా పోయింది. ఆవాల పరిశోధన స్థానం మంజూరులో జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా వ్యవహరించిన నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ఇప్పటికీ మంజూరు కాలేదు. నిధులు కానీ, శాస్త్రవేత్తలను కానీ నియమించలేదు. దీంతో ఆవాల పరిశోధనా స్థానం అటకెక్కినట్లేనని రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

ఆవ సాగు ఉత్తర తెలంగాణలోనే అధికం

ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలో దాదాపు 30 వేల ఎకరాల్లో ఆవాల పంట సాగుచేస్తున్నారు. ఇక్కడి పొడి వాతావరణ పరిస్థితులు ఆవాల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. దీనికి తోడు సాగుకు అవసరమైన ఎర్ర నేలలు ఉండడం కూడా ఆవాల సాగు విస్తీర్ణం పెరగడానికి కారణమవుతోంది. సాగునీటి వసతి ఉండడం, నాలుగైదు నీటి తడులు ఇస్తే సరిపోవడం, 80-90 రోజుల్లోనే పంట చేతికి వస్తుండడంతో రైతులు ఈ పంట సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ప్రాంతాల్లో ప్రైవేటు కంపెనీలు ఆవాల సాగును విస్తృతంగా చేపడుతున్నాయి. పలు కంపెనీలు విత్తనోత్పత్తిని చేపట్టి, ఇతర రాష్ట్రాలకు విత్తనాలు సరఫరా చేస్తున్నాయి. రైతులు విత్తనోత్పత్తిలో సాగు చేస్తే క్వింటాలుకు రూ. 9 వేల వరకు ధర అందిస్తున్నారు. సాధారణ ఆవాలకు క్వింటాలుకు రూ.7-8 వేల వరకు ధర చెల్లిస్తుండడంతో ఎక్కువ మంది రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఆవాల పంటకు అడవి పందులు, పక్షులు, కోతుల బెడద లేకపోవడం, పంట ముందుగానే ఏ రేటు వస్తుందో రైతులకు తెలియడంతో ఎక్కువగా సాగుకు ముందుకు వస్తున్నారు. మంచి పంటవస్తే ఎకరాకు 6-8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. ఎకరాకు రూ.50వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. వరి, మొక్కజొన్నకు ప్రత్యామ్నాయంగా ఆవాల పంటను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ ఫలితం కనబడటం లేదు.

నివేదికలకే పరిమితం

నాలుగేళ్ల క్రితం ఉత్తర తెలంగాణ (పొలాస) పరిశోధన స్థానం పరిధిలో ఆవాల పంట సాగుచేసి, ఇక్కడి శాస్త్రవేత్తలు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలికి నివేదికలు పంపారు. ఆవాల పరిశోధనా స్థానం ఏర్పాటు కోసం జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి సైతం సంతృప్తి వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వానికి సానుకూల నివేదికను పంపింది. కరోనా సమయంలో సంబంధిత ప్రతిపాదనలు ముందుకు కదలలేదు. అనంతరం జరిగిన జాతీయ పరిశోధన మండలి సమావేశంలో పాల్గొన్న అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తెలంగాణలోని పొలాసలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలని సూచించినా ఇప్పటివరకు ప్రతిపాదనలకు మోక్షం లభించలేదు.

గతంలోనే నివేదికలు పంపాము

- డాక్టర్ శ్రీనివాస్, ఏడీ, వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస



జగిత్యాల జిల్లా పొలాసలో వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అదనంగా ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలని గతంలోనే రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా జాతీయ వ్యవసాయ పరిశోధన మండలికి నివేదికను పంపాం. మండలి సైతం ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటుకు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తే ఉత్తర తెలంగాణ ఆవాల రైతులకు మేలు జరుగనుంది.

కొండగట్టు హుండీ ఆదాయం రూ.83.91 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, ఫిబ్రవరి 8: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని అధికారులు గురువారం లెక్కింపు చేపట్టారు. 28 రోజులకు హుండీల ద్వారా రూ.83,91,502 నగదు దేవస్థానానికి సమకూరింది. ఈ లెక్కింపులో నగదుతో పాటు 32 గ్రాముల మిశ్రమ బంగారం, 4.500కిలోల మిశ్రమ వెండి, 13 విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో పి.వెంకటేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ దేవాదాయశాఖ ఏసీ చంద్రశేఖర్, ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఆలయ సిబ్బంది, ఎస్సై అశోక్, ఏఎస్సైలు చిలుక శ్రీనివాస్, రమణారెడ్డి పాల్గొన్నారు. క్రితం సారి హుండీ లెక్కింపు సందర్భంగా సిబ్బంది సొమ్ములు తస్కరించిన నేపథ్యంలో మరోసారి అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ బందోబస్తు పెంచారు.

విద్యుత్ స్టార్టర్ల దహనం



ధర్మారంలో దహనమైన విద్యుత్ స్టార్టర్

కోనరావుపేట, ఫిబ్రవరి 8 : కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ బావి మోటరు స్టార్టర్లను దహనం చేశారు. ధర్మవరం గ్రామానికి చెందిన గంగుల మహేష్ అనే రైతుకు చెందిన వ్యవసాయ బావి రెండు మోటారు స్టార్టర్లను దహనం చేశారు. దీంతో ఆ రైతుకు పది వేల రూపాయల వరకు నష్టం వాటిలినట్లు బాధిత రైతు తెలిపాడు.

వ్యక్తి దారుణ హత్య

● పాత కక్షలతోనే అని అనుమానాలు



వెంకటరమణ(ఫైల్)

కోరుట్ల, ఫిబ్రవరి 8: పట్టణంలోని అర్బన్ కాలనీలో గురువారం సాయంత్రం ఓ వ్యక్తి హత్య ఘటన సంచలనం రేపింది. ద్విచక్రవాహనంపై వెలుతున్న వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో విచక్షణా రహితంగా దాడికి పాల్పడడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అయితే పాత కక్షలే హత్యకు కారణమని తెలుస్తోంది. కాలనీ వాసులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోరుట్ల పట్టణంలోని గాంధీ రోడ్డుకు చెందిన అనుమాల్ల వెంకటరమణ (55) పట్టణంలో వడ్డీ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. వెంకటరమణ పట్టణంలోని అర్బన్ కాలనీలో ఓ ఇంటిని గెస్టు హౌస్‌గా ఏర్పరుచుకుని అక్కడి నుంచి వడ్డీ వ్యాపారంతో పాటు ప్రైవేట్ చిట్టీలను నడిపిస్తుండేవాడు. అదే కాలనీకి చెందిన వాసాల రఘుకు వెంకటరమణ మధ్య ఓ విషయంలో మనస్పర్ధలు రావడంతో గతంలో ఇద్దరి మధ్య గొడవలు జరిగి రాజీపడ్డారు. రఘు కొన్ని రోజులు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఇటీవల తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి రఘు తన కాలనీ ప్రాంతంలోనే గణేష్ విగ్రహాల తయారీ కేంద్రంలో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల వెంకటరమణ రఘు మధ్య మరో మారు గొడవలు తలెత్తాయి. ఈ క్రమంలో గురువారం సాయంత్రం యధావిధిగా వెంకటరమణ తన ద్విచక్ర వాహనంపై తన గెస్ట్ హౌస్‌కు వెలుతుండగా మాటు వేసిన రఘు వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణా రహితంగా దాడి చేయడంతో వెంకటరమణ పక్కనే ఉన్న మురికి కాలువలో పడిపోయాడు. అప్పటికీ ఆగకుండా రఘు తన వద్ద ఉన్న కత్తితో మళ్లీ దాడి చేయడంతో వెంకటరమణ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అక్కడి నుంచి నిందితుడు పరారయ్యాడు. గమనించిన కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించడంతో మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ కిరణ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వివరాలు సేకరించి నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు రాత్రి సమయంలో పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

నష్టపరిహారం ఇచ్చి భవనాలను నిర్మించాలి

● మెడికల్ కళాశాల నిర్మాణ పనులు అడ్డుకున్న రైతులు



పనులు అడ్డుకున్న రైతులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 8 : మా భూములకు నష్టపరిహారం ఇచ్చిన తర్వాత మెడికల్ కళాశాల అదనపు భవనాలను నిర్మించుకోవాలంటూ గురువారం నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని సర్వేనంబర్ 408లో ఉన్న భూములను గత ప్రభుత్వం మెడికల్ కళాశాలకు తీసుకుని భవనం నిర్మించారు. మిగిలిన భూముల్లో తిరిగి అదనపు భవనాలను నిర్మించేందుకు బుధవారం వచ్చిన అధికారులు, కాంట్రాక్టర్‌లను రైతులు అడ్డుకోవడంతో పనులు నిలిపివేసి వెళ్లిపోయారు. గురువారం కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆరోగ్యశాఖ ఈఈ రవీందర్‌లు పెద్దూర్‌కు చెరుకుని ఎక్స్‌కావేటర్‌లతో భూములల్లో పనులను చేపట్టగా ఈ విషయం తెలుసుకున్న 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రి బాలరాజుయాదవ్‌తోపాటు రైతులు అక్కడికి చేరుకుని పనులు అడ్డుకున్నారు. అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఆందోళన చేయడంతో పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను సముదాయించినా రైతులు మాత్రం మా భూములకు నష్టపరిహారం అందించిన తరువాతనే భవనాలను నిర్మించాలని పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వం 408సర్వేనంబర్‌లో ఉన్న భూములను జీవనోపాధికోసం అందించగా వాటిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుండగా గత రెండు సంవత్సరాల క్రితం మా భూములను చదును చేసి 36 ఎకరాలల్లో మెడికల్ కళాశాల నిర్మాణాలను చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా పట్టించుకోలేదన్నారు. దీంతో మిగతా భూములను ఇవ్వవద్దని నిర్ణయించుకున్నామని తీసుకున్న భూములతో పాటు భూములకు నష్టపరిహారం అందిస్తేనే పనులు చేయిస్తామని లేకుంటే అడ్డుకుని అందోళనలు చేయడంతో పాటు నిరాహార దీక్ష చేపడుతామన్నారు. నష్టపరిహారం ఇచ్చిన తరువాతనే పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు లింగంపల్లి అశోక్, నాగుల రాజశేఖర్, ఎనగందుల ప్రేమల, గుగ్గిళ్ల అంజవ్వ, లింగంపల్లి రాజవ్వ, లింగంపల్లి దేవరాజు, గొడుగు మల్లేశం, గొడుగు ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎల్లంపల్లి గేట్‌వాల్వులు ధ్వంసం.. వృథాగా సాగునీరు



గోపాల్‌రావు పేట వద్ద వృథాగా పోతున్న నీరు

రామడుగు, ఫిబ్రవరి 8: అధికారుల అనుమతి లేకున్నా కొంతమంది ఎల్లంపల్లి పైపులైన్ గేట్ వాల్వులను ధ్వంసం చేయగా వృథాగా పంట పొలాల్లోకి నీరు రావడంతో పంటపొలాలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట, గుండి గ్రామాల మీదుగా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి బెల్లంపల్లి పైప్‌లైన్ ద్వారా నీరు వెళ్తుంది. అయితే వారం క్రితం ఎల్లంపల్లి నుంచి గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు సంబంధిత అధికారులు నీటిని విడుదల చేశారు. కాగా ఎల్లంపల్లి పైప్‌లైన్‌కు గోపాల్‌రావుపేట, గుండి గ్రామాలలో సుమారు రెండు మూడు కిలోమీటర్లకు మూడు నుంచి నాలుగు గేట్ వాల్‌లను అమర్చారు. ఇదే అదునుగా చేసుకున్న కొంతమంది గోపాల్‌రావుపేటకు సమీపంలోని ఎల్లంపల్లి పైప్‌లైన్ మీద ఉన్న రెండు గేట్‌వాల్ ధ్వంసం చేయడంతో నీరంతా పైకి లేచింది. దీంతో దేశాయిపేట చెరువులోకి నీరు వెళ్లేందుకు ఏకంగా జేసీబీతో పైప్‌లైన్‌పై కాలువ తీసి గోపాల్‌రావుపేట రైతుల అనుమతి లేకుండా అక్రమంగా కాలువను తీశారని రైతులు వాపోతున్నారు. గేట్‌వాల్‌ల నుంచి వచ్చే నీరంతా రైతుల పంటపొలాల్లోకి వెళ్లడంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఎడవల్లి రామచంద్రారెడ్డి అనే రైతు పొలంలో తన అనుమతి లేకుండానే జేసీబితో కాలువను తవ్వి నీటిని చెరువులోకి తరలిస్తున్నారని అన్నారు. గేట్‌వాల్‌ను ధ్వంసం చేసి అక్రమంగా నీటిని తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వేములవాడలో ఘనంగా మహాలింగార్చన



మహా లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, ఫిబ్రవరి 8 : వేములవాడ రాజరా జేశ్వర స్వామి వారికి గురువారం మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు ఉదయం వేళలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం వేళలో స్వామివారి కల్యాణ మండపంలో మహాలింగార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాకారంలో అమర్చిన ప్రమిదలలో జ్యోతులు వెలిగించి పూజించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ పూజలో పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక ఫిబ్రవరి8: మండలంలోని గంగారం గ్రామంలో పోలిసులు పెట్రోలింగ్ చేస్తుండగా 20 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం అక్రమంగా టాటా ఏఎస్ వాహనంలో తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. గ్రామాల్లో ప్రజల నుంచి నేరుగా విక్రహించి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. గంగారం గ్రామంలో నరహరి శంకర్‌రెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 17 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకొని సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్‌కు అప్పగించినట్లు తెలిపారు.

ఎవరైనా పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించినా నిల్వ ఉంచినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

సభలో ఉమ్మడి జిల్లా నేతలు





అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు సీఎంకు స్వాగతం పలుకుతున్న శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రి శ్రీధర్‌బాబు, విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్







సమావేశాలకు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, రమణ, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, గంగుల కమలాకర్, డాక్టర్ సంజయ్, విజయరమణారావు

చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తాం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 8: చేనేత కార్మికులకు వస్త్ర ఉత్పత్తిలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి ఉపాధి కల్పిస్తామని చేనేత, జౌళి శాఖ సంచాలకురాలు డాక్టర్ అలగు వర్షిణి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో టెస్కోవస్త్ర వీపీ ఆర్డర్లపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త రకాల వస్త్రాల రూపకల్పనపై ఆసక్తి ఉన్న చేనేత కార్మికులు వారి మగ్గాల వివరాలు ఇవ్వాలన్నారు. వారికి ఆయా వస్త్రాల ఉత్పత్తిలో శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. చిన్న చేనేత సహకార సంఘాలకు నూలు సరఫరా చేస్తామన్నారు. ప్రభుత్వ శాఖల నుంచి టెస్కో ద్వారా ఆర్డర్లు పొంది కార్మికులకు ఉపాధి కల్పించి వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ఇవ్వడానికి, రుణ సదుపాయం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. టెస్కో జనరల్ మేనేజర్ ఎస్ వెంకటేశ్వర్‌రావు, ఉప సంచాలకులు వి అశోక్‌రావు, టెస్కో టెక్నికల్ ఆఫీసర్ హిమజ్‌కుమార్, డీఎంవో వెంకటేశ్వర్లు, సహాయ సంచాలకుడు ఎస్ చరణ్, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 8: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో గురువారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాహెబ్, కృష్ణమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాజిరెడ్డి, నవీన్, నాగిరెడ్డి, రవీందర్‌రెడ్డి, సుధాకర్, మహ్మద్ లాలా, శ్రీనివాస్, భగవంతరెడ్డి, రమేశ్, దేవరాజు, రవి, సత్తిరెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

'జయ జయహే తెలంగాణ' రాష్ట్ర గీతం ఆమోదంపై హర్షం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 8: ప్రముఖ కవి అందెశ్రీ రాసిన 'జయజయహే తెలంగాణ'ను అధికారిక గీతంగా మంత్రి వర్గం ఆమోదించడంపై ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన తెలంగాణ వివేక రచయిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్శ రాములు గురువారం హర్షం వ్యక్తం చేశారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో గీతం అందరినీ కదిలించిందని పేర్కొన్నారు. అందెశ్రీ రచించిన అనేక పాటలు తెలంగాణ ప్రాంత ప్రజలను చైతన్యపరిచాయని కొనియాడారు.

నిరుపేదలను ఇబ్బందులకు గురిచేయొద్దు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 8: నిరుపేదలను ఇబ్బందులకు గురిచేయవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో ఉంటున్న లబ్ధిదారులను గురువారం కలిశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. ఓపిక నశించిన లబ్ధిదారులు ఇళ్లలోకి వస్తే అధికారులు సమస్యలు సృష్టించడం సమంజసం కాదన్నారు. విద్యుత్ సరఫరా నిలిపివేయడమంటే ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు అర్థం అవుతోందన్నారు. ఇళ్లలో ఉన్నవారందరూ పేదవారేనని ప్రభుత్వం తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎర్రవెల్లి నాగరాజు, గన్నేరం నర్సయ్య, నాయకులు సావనపల్లి రాములు, మంద అనీల్‌కుమార్, సామ నర్సింహ్మారెడ్డి, సొల్లు సాయికుమార్, పెండాల ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణాన్ని అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 8: మండలంలోని దాచారం శివారులో కాలువ నిర్మాణాన్ని అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని యువజన సంఘాల నాయకులు డిప్యూటీ తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. సాగునీటి కోసం ప్రభుత్వం కాలువ నిర్మాణం చేయాలని చూస్తుండగా చిన్నకోడూర్ మండలం విఠాలపూర్ గ్రామస్థులు అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. కాలువ నిర్మాణం నిలిచిపోవడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారన్నారు. యువజన సంఘాల అధ్యక్షుడు బెంద్రం తిరుపతి రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు..

దివ్యాంగులకు సకాలంలో పింఛన్లు పంపిణీ చేయాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 8: దివ్యాంగులకు ప్రభుత్వం సకాలంలో పింఛన్లు పంపిణీ చేయాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో జిల్లా సంఘం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చాలా మంది దివ్యాంగులు పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. సమావేశంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు మంగళారపు రాజేందర్, యెల్లె హరిప్రసాద్, మన్మోహన్, మల్యాల ప్రశాంత్, ఎనగందుల రాజు, రవి పాల్గొన్నారు.

పెద్దూర్ యువజన కాంగ్రెస్ కార్యవర్గం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 8 : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు పెద్దూర్ యువజన కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని గురువారం నియమించినట్లు పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చిందం శ్రీనివాస్ ప్రకటించారు. వార్డు అధ్యక్షుడిగా నీరటి శ్యాంకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యవర్గ సభ్యులుగా సలేంద్రి రజనీకాంత్, రాచర్ల ప్రశాంత్, గుగ్గిళ్ల బాలాజీ, బెజ్జారపు అజయ్, గోడుగు మధు, జెట్టి శ్రావణ్, సలేంద్రి కిరణ్, సలేంద్రి తిరుపతి, నీరటి మధు, సిక్టే యాకూబ్, నాగుల రాజశేఖర్, సలేంద్రి మధును నియమించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బెజ్జారపు బాలరాజుగౌడ్, 8వవార్డు ఇన్‌చార్జి మంగ కిరణ్‌కుమార్, సలేంద్రి వేణుగోపాల్‌యాదవ్, ఆదిపెల్లి నాగరాజుగౌడ్, గుగ్గిళ్ల తిరుపతి, రెడ్డిమల్ల దేవేందర్, అతికం నర్సయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రంలో బీజేపీ పాలన

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 8: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన కొనసాగిస్తోందని, కేరళవామ పక్ష ప్రభుత్వం, దక్షిణాది రాష్ట్రాలపై కక్షపూరిత, నిరంకుశ విధానాలను మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో పన్నుల రూపకంగా వసూలు చేసిన నిధులను అన్నిరాష్ట్రాల వాటాను సమానంగా అందించాల్సిన కేంద్ర ప్రభుత్వం కేవలం బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల అభివృద్ధికి ఎక్కువ శాతం కేటాయిస్తోందని, వామపక్ష ప్రభుత్వం ఉన్న కేరళ, ఇతర పార్టీలు అధికారంలో ఉన్న కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి దక్షిణాది రాష్ట్రాలకు సమానమైన నిధులను కేటాయించడం లేదని మండిపడ్డారు. దీనిపై ఢిల్లీలో నిర్వహించనున్న ఆందోళనలకు వామపక్ష పార్టీల నాయకులు పాల్గొనాలన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 8: సిరిసిల్ల కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో గురువారం పీఆర్టీయూ తెలంగాణ క్యాలెండర్‌ను జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు మ్యాడారం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి టేకుమల్ల శ్రీకాంత్, అసోషియేట్ అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, హరిందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రమేష్, శ్రీధర్‌రెడ్డి, ద్యాగల రమేష్, కార్యదర్శి శ్రీనాథ్ పాల్గొన్నారు.

విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

గంభీరావుపేట, ఫిబ్రవరి 8 : తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్‌కమార్ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యారంగానికి నిధులు కేటాయించకుండా కాల యాపన చేసిందన్నారు. ఇప్పటికే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంటు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

సహకార సంఘం ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 8: త్వరలో జరగబోయే ప్రాథమిక గొర్రెల పెంపకదారుల సహకార సంఘం ఎన్నికల కోసం గొల్ల, కురుమలు సిద్ధంగా ఉండాలని పశువైద్యాధికారి సంతోష్ సూచించారు. గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మండల యాదవ సంఘంలో ప్రాథమిక గొర్రెల పెంపకదారుల సహకార సంఘం ఎన్నికలపై మండలంలోని ఆయా గ్రామాల సొసైటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి సొసైటీ రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు గోగు మల్లేశం యాదవ్, ప్రధాన కార్యదర్శి మాందాటి తిరుపతి యాదవ్, గౌరవ అధ్యక్షుడు బండి దేవేందర్, మండల యాదవ సంఘం సొసైటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాలుగు విభాగాల్లో పోటీలు

గంభీరావుపేట, ఫిబ్రవరి 8 : గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టు పీజీ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మండల స్థాయిలో వివిధ పాఠశాలల విద్యార్థులకు నాలుగు విభాగాల్లో గురువారం పోటీలను నిర్వహించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పాటలు, కవితలు, చిత్రలేఖనం. ఉపన్యాస పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి గంగారాం, పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాస్, పద్మాదేవి తదితరులు ఉన్నారు.

లోక్ సభ ఎన్నికలకు కసరత్తు

- ఓటరు జాబితా రెడీ
- శాసన సభ కంటే పెరిగిన ఓటర్లు
- రెండు సెగ్మెంట్లలో మహిళా ఓటర్లే అధికం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

శాసనసభ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం అదే స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల సెగ్మెంట్లకు సంబంధించి మొదటి విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయ్యింది. గురువారం తుది ఓటరు జాబితా వెల్లడైంది. దీంతో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. ఓటరు జాబితా విడుదలవడంతో ఎన్నికల షెడ్యూల్ రావడానికి ఎక్కువ రోజులు పట్టకపోవచ్చని భావిస్తున్నారు. జిల్లాలో తుది ఓటరు జాబితా ప్రకారం స్వల్పంగానే ఓటర్ల సంఖ్య పెరిగింది. గత శాసనసభ ఎన్నికలతో పోల్చుకుంటే ఓటర్ల జాబితా ఎక్కువగా పెరిగినట్లు చెప్పుకోవచ్చు.


స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి (ఫైల్)

తుది జాబితా ఓటర్లు 4,70,438 మంది

జిల్లాలో ప్రధానంగా ఉన్న సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో తుది ఓటరు జాబితా ప్రకారం 4,70,438 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 2,26,923 మంది, మహిళలు 2,43,475 మంది, 40 మంది జెండర్ ఓటర్లు ఉన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రకారం 4,67,905 ఓటర్లు ఉండగా స్వల్పంగా ఓటర్లు పెరిగారు. 2533 మంది పెరుగుదల ఉంది. శాసనసభ ఎన్నికల సమయంలో రెండు సెగ్మెంట్లలో 4,58,958 మంది ఓటర్లు ఉండగా 11480 మంది ఓటర్లు పెరిగారు. ప్రస్తుతం తుది జాబితా ప్రకారం వేములవాడ సెగ్మెంట్‌లో 2,25,323 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,07,783 మంది, మహిళలు 1,17,508మంది జెండర్‌లు 32 మంది ఉన్నారు. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2,55,115 మంది ఉండగా పురుషులు 1,19,140 మంది, మహిళలు 1,25,967 మంది, జెండర్‌లు ఎనిమిది మంది ఉన్నారు. రెండు సెగ్మెంట్లలో సర్వీస్ ఓటర్లు 159 మంది ఉండగా వేములవాడలో 53 మంది, సిరిసిల్లలో 106 మంది ఉన్నారు.

రెండు సెగ్మెంట్లలో మహిళలే అధికం

జిల్లాలో రెండు సెగ్మెంట్లలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో 4,70,438 మంది ఓటర్లు ఉండగా మహిళలు అధికంగా 16,552 మంది ఉన్నారు. వేములవాడ సెగ్మెంట్‌లో 2,25,323 మంది ఓటర్లు ఉండగా మహిళలు 9725 మంది, సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2,45,115 మంది ఓటర్లు ఉండగా మహిళలు 6827 మంది అధికంగా ఉన్నారు. ఎన్నికల్లో మహిళల ఓట్లే కీలకంగా ఉన్నాయి.

కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే చోట

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో ఎన్నికల సమయంలో ఒకే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు వేర్వేరు పోలింగ్ బూత్‌ల్లో ఓట్లు వేసే పరిస్థితులు లేకుండా ఒకే చోట ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టారు. ఆధార్ అనుసంధానంతో డబుల్ ఓట్లను తొలగించారు. ఒకే పోలింగ్ కేంద్రంలో 1500 మంది ఓటర్లకు మించి ఉండకుండా పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వివిధ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి పకడ్బందీగా ఓటరు జాబితా తయారు చేశారు.

ఓటరుగా నమోదు కావచ్చు

- కలెక్టర్ అనురాగ్ జయంతి

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది ఓటరు జాబితాను వెల్లడించినట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇంకా ఎవరైనా ఓటరుగా నమోదు కాకపోయినా ఓటరు జాబితాలో పేర్లు లేకపోయినా జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు కావచ్చని తెలిపారు. తుది ఓటరు జాబితాను కలెక్టరేట్, రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, తహసీల్ కార్యాలయాలతోపాటు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఓటరు జాబితా కాపీని అందజేస్తామన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటిద్దాం


సిరిసిల్లలో విద్యార్థుల ప్రదర్శన తిలకిస్తున్న ఎస్పీ


వేములవాడలో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 8: రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలను నివారిద్దామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని నేతన్న చౌక్ వద్ద శ్రీచైతన్య స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన నిర్వహించారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు ఇంటి నుంచి బయటకు వెళ్లేటపుడు తప్పని సరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. హెల్మెట్, షీట్ బెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, టౌన్ సీఐ రఘుపతి, ట్రాఫిక్ ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించేందుకు సహకరించాలని వేములవాడ ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్ అన్నారు. గురువారం స్థానిక విద్యార్థులతో కలిసి రాజన్న ఆలయం ముందు ట్రాఫిక్ నిబంధనలపై ఆటాపాటలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తరచూ జరిగే ప్రమాదాలలో అత్యధికంగా వాహనాల వల్లే జరుగుతున్నాయని, నియమ నిబంధనలు పాటించి సురక్షితంగా ఇంటికి చేరుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి వైద్యురాలు దీప్తి తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను అక్షర రూపంలో దాచుకుందాం

వేములవాడ, ఫిబ్రవరి 8 : చరిత్రను అక్షర రూపంలో దాచుకొని భావితరాలకు అందిద్దామని ప్రముఖ చారిత్రక పరిశోధకుడు సంకేపల్లి నాగేంద్ర శర్మ అన్నారు. యువకవి వీరగోని చైతన్య గౌడ్ రచించిన చైతన్య స్రవంతి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం గురువారం వేములవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంకేపల్లి నాగేంద్ర శర్మ మాట్లాడుతూ జీవన విధానం నుంచి ఆధునిక ప్రపంచం వరకు మనకు ముందుండి నడిపించేది చరిత్రనేనని, అలాంటి చరిత్రను కాపాడుకొని భావితరాలకు అందించాలని కోరారు. చైతన్య స్రవంతి వచన సాహిత్యంలో చక్కని స్థానం దక్కించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ ఆవుల మల్లారెడ్డి, పోటీ పరీక్షల విషయ నిపుణుడు డాక్టర్ ప్రసన్న హరికృష్ణ, గురువులు వీరగోని ఆంజనేయులు గౌడ్, తిరునగరి లక్ష్మణస్వామి, తెరావే రాష్ట్ర కార్యదర్శి ఆడేపు లక్ష్మణ్, ఇగురం పుస్తక రచయిత గంగాడి సుధీర్, గోనె బాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, రిటైర్డ్ ఉపాధ్యాయులు

పల్లెల్లో కొనసాగుతున్న పారిశుధ్య పనులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 8: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, అల్మాస్‌పూర్, రాజన్నపేట, గుండారం, తిమ్మాపూర్, బొప్పాపూర్, నారాయణపూర్, వెంకటాపూర్, పదిర, హరిదాస్‌నగర్, బండలింగంపల్లి, కోరుట్లపేట తదితర గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గురువారం స్వచ్ఛత పనులను చేపట్టారు. ఆయా గ్రామాల్లోని మురుగు నీటి కాల్వలు, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పల్లెల అభివృద్ధికి పాటు పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రత్యేక అధికారులు రాంచందర్, చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ల సరఫరాకు ఓపెన్ టెండర్ల ఆహ్వానం

చందుర్తి, జనవరి 8 : చందుర్తి, రుద్రంగి మండలాలలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో కంప్యూటర్ సరఫరా కోసం ఓపెన్ టెండర్లను స్వీకరిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస దీక్షితులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన ఏజెన్సీ, ఎంటర్ ప్రైజెస్‌లు టెండర్లను ఈ నెల 10వ తేదీ నుంచి 13 వరకు సాయంత్రం 5 గంటలలోగా మండల విద్యా వనరుల కేంద్రంలో అందజేయాలని కోరారు.

ఆలయ ఆవరణలో బోరు బావికి భూమి పూజ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 8: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీకేశవ పెరుమాండ్ల ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో బోరు బావి తవ్వకానికి స్థానిక నాయకులు గురువారం భూమి పూజ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని నాయకులు బోరు బావి వేయడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. నాయకులు నర్సయ్య, తిరుపతి, లింగాగౌడ్, లక్ష్మారెడ్డి, బాబు, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, అంజయ్య, బుచ్చాగౌడ్, రాజుకుమార్, లాలా, జితేందర్, వెంకటేష్, కనకరాజు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భారత్‌ను ప్రపంచ స్థాయిలో నిలిపిన ఘనత మోదీదే


రైతుతో మాట్లాడుతున్న చెన్నమనేని వికాస్‌రావు

కోనరావుపేట, ఫిబ్రవరి 8 : మన దేశాన్ని, మన ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో నిలబెట్టిన ఘనత ప్రధానమంత్రి మోదీదేనని బీజేపీ నేత, ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. కోనరావుపేట మండలం నాగారంలో గురువారం 'గావ్ చలో బస్తీ చలో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్‌ని మరోసారి గెలిపించి మోదీకి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. బీజేపీ జిల్లా నాయకుడు గోపాడి సురేందర్‌రావు, మండల అధ్యక్షుడు గొట్టె రామచంద్రం, బీజేపీ నాయకులు తిరుపతి గౌడ్, మోత్కు మోహన్, తీగల రవీందర్ గౌడ్, ప్రదీప్, గంగయ్య, రాములు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి

ముస్తాబాద్: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశావ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. ముస్తాబాద్‌లో గురువారం సీపీఐ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీపీఐ మండల కార్యదర్శి మిద్దె నర్సన్న, అన్నవేని భూదన్న, రామచంద్రం, బాలరాజు, శంకర్, ఆనంద్, రాములు, బాలయ్య, బాలరాజు, చంద్రం, రాజగోపాల్, మహేందర్ పాల్గొన్నారు.

వేములవాడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను అన్ని కార్మిక సంఘాలు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు అన్నారు. దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం స్థానిక కార్మిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కార్మిక సంఘాలు ట్రేడ్ యూనియన్, ఇప్పటికే బంద్ నోటీసులు ఇచ్చాయన్నారు. గ్రామీణ భారత్ బంద్ అన్ని కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలన్నారు. కేంద్రంలోని ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను ఎత్తివేస్తున్న తరుణంలో ఈ బంద్‌కు కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ పిలుపునిచ్చిందన్నారు. సీఐటీయూ నాయకులు బాల్ రెడ్డి, ఐఎఫ్‌టీయూ నాయకులు మల్లయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు రుక్మిణి, గుర్రం అశోక్, లక్ష్మణ్, గాజుల పోశెట్టి ఉన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్న భోజన కార్మికుల దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. మధ్యాహ్న భోజనరంగ జిల్లా కార్యదర్శి గురుజాల శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా వేములవాడలో ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. జవ్వాజి విమల, బాలమణి, కవిత, రాధ, వసంత, దేవవ్వ పాల్గొన్నారు.

కన్నుల పండువగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 8: ముస్తాబాద్ మండలంలోని చీకోడ్‌లో లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు కొండపాక నర్సింహచార్యులు, గోపికృష్ణ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. శుక్రవారం ఎడ్ల బండ్ల జాతర, శనివారం రథోత్సవం కార్యక్రమం జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ సర్పంచ్ రజిత సుధాకర్‌రెడ్డి, బాల్‌రాజిరెడ్డి, కోశాధికారి బాల్‌రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఆర్టీఐ ఇన్‌చార్జిగా చందు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 8: మండలంలోని రేపాక గ్రామానికి చెందిన మూడపల్లి చందును యువజన కాంగ్రెస్ ఆర్టీఐ ఇన్‌చార్జిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సల్ల నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. చందు ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతుండగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జహీరాబాద్ పార్లమెంట్, మానకొండూర్ అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమించారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 8: మండలంలోని వెల్జీపూర్ గ్రామానికి చెందిన గుండ రామాంజనేయులు మొబైల్ ఫోన్ పోగొట్టుకోగా గురువారం అప్పగించినట్లు ఎస్సై దాస సుధాకర్ తెలిపారు. రామాంజనేయులు రూ.22వేల విలువైన ఫోనును పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ విధానంతో కనపెట్టి అప్పగించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 8: మండలంలోని కందికట్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పసుల అఖిల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ సాబిర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలో జరిగిన అండర్ 16 కబడ్డీ విభాగంలో అఖిల ప్రతిభ కనబర్చింది. ఈసందర్భంగా అఖిలను ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస చారి అభినందించారు.

పదోతరగతి విద్యార్థుల రికార్డుల పరిశీలన

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 8 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదోతరగతి చదవుతున్న విద్యార్థుల రికార్డులను గురువారం మానిటరింగ్ టీంలు పరిశీలించినట్లు జిల్లా పరీక్ష విభాగం అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట, పెద్దూర్ జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలతోపాటు పట్టణంలోని శివనగర్ కుసుమరామయ్య బాలుర జిల్లా ఉన్నత పాఠశాలతోపాటు పట్టణంలోని సిద్దార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, శ్రీకృష్ణవేణి టాలెంట్ హైస్కూల్‌లలో మానిటరింగ్‌టీంలు పదోతరగతి విద్యార్థుల రికార్డులను పరిశీలించారు.

మట్టి నిల్వలను పరిశీలించిన మైనింగ్ ఏడీ

బోయినపల్లి, ఫిబ్రవరి 8: బోయినపల్లి మండలం స్తంభంపల్లి గ్రామ శివారులో ఉన్న చెరువు మట్టి నిల్వలను మైనింగ్ ఏడీ రఘుబాబు గురువారం పరిశీలించారు. స్తంబంపల్లి చెరవు నుంచి మట్టిని వెలికి తీసి నిల్వ చేశారు. నిల్వచేసిన మట్టిని ఇటుక బట్టీల వ్యాపారులు తరలిస్తున్నారని పలువురు ఫిర్యాదు చేయడంతో పరిశీలించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

హరితహారం చెట్ల నరికివేత

- పట్టించుకోని అధికారులు - స్థానికుల ఆగ్రహం


సిరిసిల్ల పట్టణంలో నరికిన చెట్లు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 8: పర్యావరణ పరిరక్షణ కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించింది. సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో పాలకులు, అధికారులు క్షేత్రస్థాయిలో 39 వార్డుల్లో తొమ్మిదిన్నర సంవత్సరాలలో లక్షల మొక్కలను నాటారు. నాటిన మొక్కలు కొన్ని వార్డులలో జీవం పోసుకొని చెట్లుగా ఎదిగి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్నాయి. అటవీశాఖ, మున్సిపల్ అధికారుల నుంచి అనుమతులు లేకుండా పట్టణంలోని కొన్ని వార్డుల్లో కొందరు ఇష్టారాజ్యంగా చెట్లను నరికివేస్తున్నారు. జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పట్టణంలో అనుమతులు లేకుండా చెట్లను నరికేస్తున్న వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో మున్సిపల్ కమిషనర్‌గా విధులను నిర్వహించిన రమణాచారి పట్టణంలోని వార్డుల్లో అనుమతులు లేకుండా చెట్లనుగానీ, వాటి కొమ్మలనుగానీ నరికిన వారికి భారీ జరిమానా విధించారు. ప్రస్తుతం పట్టణంలో రోడ్లకు ఇరువైపుల ఉన్న చెట్లను కొందరు నరికేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని, పట్టణలోని వార్డులో రోడ్లకు ఇరువైపుల ఉన్న చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ తోడ్పడాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

- చంద్రమౌళిగౌడ్, రగుడు సిరిసిల్ల



పర్యావరణ పరిరక్షణ కోసం పట్టణంలో నాటిన చెట్లను కొందరు అనుమతి లేకుండా నరికేస్తున్నారు. వారిపై చర్యల తీసుకోవాలి. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే చెట్లను కాపాడుకోవల్సిన బాధ్యత మనపైనే ఉంది. రేపటి తరానికి చక్కటి వాతావరణాన్ని అందించాలంటే ప్రతీ ఇంటి ముందు మొక్కలు నాటి వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలి.

అధికారుల అలసత్వంతోనే నరికివేత

- పంతం రవి, సీపీఐ నాయకుడు, సిరిసిల్ల



పట్టణంలో అధికారుల అలసత్వంతో చెట్లను నరికేస్తున్నారు. అనుమతి లేకుండా చెట్లను నరిన వారిపై చర్యలు తీసుకోవాలి. సిరిసిల్ల పట్టణం ప్రధాన రహదారుల గుండా భారీ వృక్షాలు ఉండేవి. రోడ్ల విస్తరణలో భాగంగా నరికే యడంతో కాలుష్యం పెరిగింది. ఇళ్ల ఎదుట ఇబ్బందికరంగా పెరిగిన చెట్లను తొలగించడానికి అధికారుల అనుమతి తీసుకోవాలి.